# చేసుకున్నపాపం!

"అ(పావ్ టేబులెప్పుడూ నీట్‌గా వుంటుంది." టేబుల్ నీట్‌గా వుండట మేమిటి...? ఎవరన్నా వింటే నవ్విపోతారు.

ఫలానా తాయారమ్మ ఇల్లు నీట్‌గా వుంటుంది, లేదా వుంచుతుంది అని నమ్ముతాను. లేదా ఫలానావాళ్ళ అమ్మాయి ఎప్పుడు చూసినా నీట్‌గా వుంటుంది. అరవిచ్చిన ముద్ద మందారంలా రాత్రా నవ్వుతూ వుంటుంది అని వింటాను. అల్లి... చక్కదనాల చుబ్బుర్ని చూసి, స్నానం చేసినా చెయ్యక పోయినా చాటంటే చీరలా శుభ్రంగా వుంటుం దెప్పుడూ అని మురిసిపోయే వాళ్ళ బావ మురిపాలు చెప్ప చెవులారగించి మరీ వింటాను.

అంతేగాని టేబుల్ నీట్‌గా వుందని... అందునా గవర్నమెంటాఫీసులో టేబులట, నీట్‌గా వుండటమట. అక్కడ ఫైళ్ళలాగే... టేబుళ్ళూ దుమ్ము కొట్టుకుంటాయి. మరలాంటప్పుడు గవర్నమెంటా ఫీసులో పన్చే సే అప్పారావు టేబులెలా నీట్‌గా వుంటుంది. తెలుగుగంగ పథకం అమల్లోకొచ్చి రాయలసీమ రతనాల సీమయిపోయిందని చెప్తే ఎలా నమ్మరో... —యిదిగో యీ విషయం చెప్పినా అంతే. అంచేత నోర్మూసు క్కూర్చోండంతామా అంటే వింటేనా?

సరేకదా అన్చెప్పి చూస్తే, నిజమేనండోయ్ మన వాళ్ళు చెప్పింది, అక్షరాలా నిజం.

అ(పావ్ టేబు లెలా నీట్‌గా వుంటుంది చెప్మా...
"ఇది విన్నావయ్యా సుబ్బారావు"...

ఇది కన్నావయ్యా రంగారావ్..." అంటూ

"అప్పారావు — టేబులు" కథా కమామిషు గురించి జోరుగా హుషారుగా వర్ణించుకుంటున్నారు, అకౌంట్స్ జనరలాఫీసు కేంటీన్‌లో. ఆఫీసులో పనులు చేస్తున్నవారికంటే కేంటీన్‌లో కూర్చుని బాతాఖానీ వేసేవారి సంఖ్యే ఎక్కువగా వుంది. అందుకే టేబుల్ మీద కదలని ఫైళ్ళు బొత్తులు బొత్తులు వుంటాయి. రోజులో ఓ అరగంటన్నా పన్చెయ్యకపోతే బావోదనుకునే మొహమాటస్తులు...... సీట్ల ముందు కూర్చుంటే... ఎదుటి సీటువాడికి ఫైళ్ళదొంతి మధ్య వారి తలకాయలు చూద్దామన్నా కనిపించవు. అస లలా ఎవరి టేబుళ్ళ మీద ఎక్కువ ఫైళ్ళు పేరుకుంటే, వాళ్ళంత గొప్పగా మిగిలిన కొలీగ్స్ మధ్య కాలరెత్తి పట్టుకుని నడుస్తూంటారు. అదిగో, అలాటివారి మధ్య కొచ్చిపడ్డ అప్పారావు ఆర్నెల్లయినా తనేంటో... తన పనేంటో. అంతే తప్ప మరో ధ్యాస లేదు కదా. అసలా ఫీసులో తన సహోద్యోగు లెవరో? ఎంత మందున్నారో... ఎలాటివారో... ఏమీ పట్టదు అతనికి. అంతదాకా ఎందుకూ... అప్పారావు టేబుల్‌ని ఆనుకుని మీనకళ్ళ మీనాక్షి కూర్చుంటుందా. ఆమెతో మాట్లాడిన పాపాన పోలే దెప్పుడూను... చాలు చూపులు చూసేఅలవాటు కూడా లేని బుద్ధిమంతుడ నుకోండి. సరేఒప్పుకుంటాం. మరి తన సీటుకి నాలుగడుగుల దూరంలో ఎదురుగా కూర్చునే నీలికళ్ళ నీలవేణిని పలకరించడం అటుంచి చూసిన పాపాన కూడా పోలేదు. "కళ్ళెత్తితే చాలు కనకాభిషేకాలు" అనుకునే మగవాళ్ళు తారసపడ్డ నీల వేణికి యితగాడి వ్యవహార మేమీ కొరుకుడు పడక,




పి.తార్క్.దేవి

అప్పటికే అతడి గురించి వర్ణించుకునేవాళ్ళు జల కట్టేసింది.

వంచిన తల ఎత్తకుండా పన్చేసుకునే అప్పారావు కిదేమీ తెలీదు పాపం. వచ్చిన నెలకే "యితని దగ్గర ఫైళ్ళు తొందరగా కదిలిపోతాయ్" అన్న అపవాదు (యితర కొలీగ్స్ దృష్టిలో ఇది ప్రశంసకాదు. అపవాదే.) కూడా తెచ్చుకున్నాడాయె. దాంతో తులసి వనంలో గంజాయి మొక్కలా యితనెక్కడ దాపురించాడు మనకి అని కూడా అనుకోసాగారు. ఇలాటి తర్జన భర్జనల మధ్య రెండు సంవత్సరాలు గిర్రున తిరిగిపోయాయి. కాలం ఎప్పుడూ ఒకేలా వుంటే యిహనేం...

శుభ్రతకి మారు పేరులా వుండే అప్పారావ్ ఈ మధ్య మాసిన బట్టలు, నలిగిన బట్టలతో ఎలా పడితే అలా ఆఫీసుకొస్తున్నాడు. వీటికే మాటికే నిట్టూర్పులు విడవడం, శూన్యంలోకి చూడ్డం ఎక్కువైపోయాయి.

"అవతారమెత్తినావ సామినాథా... దీని క్కారణమూ చెప్పవా సామినాథా" అని అడిగేపాటి చనువెవరికీ లేదు.

"మొత్తానికెప్పుడూ వార్తల్లో వ్యక్తే మన అప్పారావ్" అని తేల్చిపారేశాడు సుబ్బారావ్. యథాప్రకారం చర్చలు కొనసాగుతున్నాయి క్యాంటీన్‌లో.

"ఏదె లావున్నా మనందర్లోకి సిన్సియర్, ఓపెన్ మైండెడ్‌గా వుండే అప్పారావ్ యిలా అయిపోయాడంటే... ఏదో జరిగే వుంటుంది."

"ఏదో జరిగి వుంటుందనేది అందరికీ తెలుసు. ఏం జరిగిందన్నదే తప్ప" "పరామర్శకెళ్ళినట్లెళ్ళి విషయం తెలుసుకునొద్దామా..." అన్నాడు వుత్సాహంగా మిత్ర బృందానికి చెందినవాడు. వ్యక్తిమీద జాలి కొద్దీ కాదు సుమండీ.

"ఏముఖ్ఖర్లేదు..." అంటూ కొట్టిపారేసాడు, కాళ్ళు రెండూ టేబుల్‌కి తన్ని పెట్టి, కుర్చీలో వెనక్కి జారగిలబడి కూర్చున్న జర్దాకిళ్ళీ జోగారావు.

ఎందుకన్నట్టు చూస్తున్న వారికేసి తిరిగి "అప్పారావ్‌ది మనోవ్యథ. మనోవ్యథకి మందు లేదు. యిదందరికీ తెలిసిన విషయమే. అయితే తనపని తన లోకంగా వుండే వ్యక్తి ఫైళ్ళని మురగపెట్టడంలో మన్ని మించి పోయాడే. ఏదో బెంగ పెట్టుకున్నవాడల్లే మన మధ్యా తిరుగుతున్నాడే... ఒకచోట కల్సి పని చేస్తున్న వాళ్ళం. ఆ సంగతి అతనికి పట్టకపోయినా, పలకరించడం మన విధాయకం అని మీరంటారు. నిజమే. కాని ఫలించని పలకరింపులెందుకు శుద్ధ దండగ" అని తేల్చిపారేసాడు జోగారావు. "మరో విషయం. మీకు వ్యక్తి మీదకంటె విషయం తెల్సుకోవాలనే దాని మీదే ఆసక్తి. నాకు తెల్సిపోయిందని వర్రీ అవకండి. ఇది మానవ నైజం" అని వాళ్ళకభయమిచ్చాడు. అంతా తేలుకుట్టిన దొంగల్లే వుండి పోయారు. కొద్ది సేపు వాళ్ళ మధ్య నిశ్శబ్దం. నీకు తెలిస్తే చెప్పూ చంపక అన్నారు ముక్తకంఠంతో.

సిగరెట్టు పొగ రింగురింగులుగా గాల్లోకి వదులుతూ అప్పారావ్ కథంతా చెప్పుకొచ్చాడు జోగారావ్.

"...... పెళ్ళికెదిగిన చెల్లెలు, రేపోమాపో అన్నట్టున్నా కాటికి కాళ్ళు జాపి కూర్చున్న తల్లి, పిచ్చిమారాజులాంటి అప్పారావ్ కళ్ళల్లోంచి ప్రపంచాన్ని చూద్దామని ఉబలాటపడే అమాయకపు భార్య, ఇద్దరుపిల్లలు... నత్తానాగా వెరసి అయిదారుమందున్న కుటుంబాన్ని, చెరువులో చేపల్లే ఈదుకొస్తున్నాడు అప్పారావ్. ఇది ఇలా వుండగా... ఇంతలో ఏమయ్యిందో ఓ రోజు సాయంత్రం అప్పారావ్ ఇంటికెళ్ళేసరికి పరివారమంతా సభ తీర్చి వుంది. ఎందుకూ... ఏమిటీ అని భోగట్టా చేసేసరికి — అల్లా వాళ్ళంతా 'టీవీ'లు కొనుక్కున్నారు. ఎక్కే గుమ్మం దిగే గుమ్మంలా వుంది మాపని. వచ్చే సిగ్గేస్తోందనుకో, అయినా వేళకి కాళ్ళూరుకోవటంలేదు. యిహ లాభం లేదు. మాకూ టీ.వీ. కొంటావా... చస్తావా" అని హఠాయించు క్కూర్చున్నారంతా. మనవల్నిద్దర్ని చెరో వైపు కూర్చోబెట్టుకున్న తల్లి న్చూసి లాభం లేదనుకుని దన్నుకోసం భార్యకేసి చూసే సరికి కళ్ళార్పి పుల్లా చేస్తుందే తప్ప తన వైపు రావడానికి ససేమిరా అంటోంది. అలా ఓ పది రోజులు గడిచేసరికి యిలా కాదనిచెప్పి తన బామ్మర్ది వేలు విడిచిన మేనమావ స్నేహితుడి కొడుక్కి, ఎయిర్ కూలర్లు, ఫ్రిజిడేర్లు, టీవీలు హోల్‌సేల్‌గా అమ్మే షాపొకటుందనితెల్సింది. ఆ మర్నాడు అటుకేసి వెళ్ళి వాయిదాల పద్ధతి మీదో టీవీ కొనుక్కొచ్చాట్ట. యింటో సంబరం యింతా అంతా కాదు. కొత్త పిచ్చి కదా! నచ్చేవీ, నచ్చనివీ అనకుండా, పాట పంటా దగ్గర్నించీ... స్టేషన్ కట్టేసే వరకూ చూసేస్తుండేవార్ట. ఆ తర్వాత తాజోరు తగ్గిందనుకో — మొత్తానికేదో బాసే కాలక్షేపం చేస్తూండే వాట్ట. ఆఖరి వాయిదా కూడా కట్టేసి వూపిరి పీల్చుకున్నాడో లేదో... పురమని పిడుగులా వచ్చిపడిందో వార్త. ఓ సుప్రభాతపు వేళ పెళ్ళాం చేతి కాఫీ అమృతంలా భావించి సేవిస్తున్న తరుణంలో పక్కవాళ్ళ పేపర్..."

జోగారావ్ మాటని పూర్తి చెయ్యి నివ్వకుండా "అంత వుదయాన్నే పరాయి వాళ్ళ పేపరెట్లా వచ్చిందతని చేతిలోకి" అంటూ ప్రశ్నార్థకంగా మొహం పెట్టాడు సుబ్బారావ్.

కొంతమంది కంతే. ప్రతుకంతా సందేహమే.

"ఆరవ్వందే పక్కింటో వాళ్ళెక్కడ తీస్తారంట...?" అన్చెప్పి ప్రస్తుతంలోకొచ్చే లోపల — అసలు విషయం చెప్పూ చంపక అన్నారంతా.

వస్తున్నా తొందరెందుకు అని అప్పుడు చెప్పాడు- "దసరా నుండి టీవీలో తెలుగు ప్రసారాలు ప్రారంభం" అన్న వార్త చదివాట్టండీ. అదిగో అప్పట్నించీ యిలా..."

!!! —!!! —!!!...? ★

## దారిద్ర్య రేఖ

ఈ దేశంలో మనిషి జన్మ ఎత్తడం కంటే
ఓడలా సముద్రంలో మునిగిపోవడం మేలు
విమానంలా గాలిలో ముక్కలై పోవడం మేలు
ప్రజలు ఆకలి భరించిన రకరకాల దుస్తులు
కసాయివాడిని ఆరాధించే మేకల మందలు
మానవ జాతిని వెతుక్కుంటూ గాయాలు
భూమండలం మీద చేసే ప్రయోగాలకు
అంతిమ గమ్యం ఈ దేశం-
కాఫీ కప్పుల్లో తేలుతున్న గుమాస్తాల జీవచ్ఛవాలు
ఆఫీసుల్లో తూగుతున్న దినాలు
బార్లలో వివస్త్ర నృత్యాలు చేస్తున్న రాత్రులు
ప్రభుత్వం ప్రజల కోసం నిర్మించిన భవంతులు
పేవ్‌మెంట్లు.
గాయాల్లోంచి రక్తంలా ప్రవహిస్తున్న నదులు
ఖాళీ గ్లాసుల్లాంటి గ్రామాలు
రత్నాలుగా, ముత్యాలుగా, వజ్రాలుగా
మారిపోతున్న బియ్యపు గింజలు -
నుదుటి మీద "దారిద్ర్యరేఖ" గీచే హస్తాసి కేపోలు వేసే
"ప్రయోజనులు"
జీవన నైరాశ్యంలోకి కుంచించుకు పోతున్న ఆకాశ
హర్మ్యాలు
నాగరికతల్ని సృష్టించిన చేతులతోనే ప్రజల్ని ఆది
మానవ్వులుగా మారుస్తున్న ఆకలి బాధలు
చరిత్ర మనిషి మీద జరుపుతున్న అత్యాచారాలు
ఎవరెస్ట్ ఎక్కిన మనిషికి నైతిక పాతాళం ఈ దేశం -
ఒద్దు! దేశం అనే ఈ సజీవ సమాధిలోకి అడుగు
పెట్టవద్దు.
ఈ నేలలో కలుపుమొక్కగా కూడా మొలవవద్దు.

—సాత్యకి

